


ఆ సాయం వేళలో వంటరిగా తాడు తెగిన గాలిపటంలా నుంచుంది వలజ.

తెల్లారితే బ్రతుకు పెద్ద ప్రాబ్లంగా తయారౌతుంది ఆమెకి. అంతవరకూ రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్న కంపెనీ దివాలా తీయడంతో ఆమె బ్రతుకు బజార్నపడింది. తనూ, తన సంపాదనపై ఆధారపడి బ్రతుకుతున్న ముసలి తండ్రీ, కాలేజీలో చదువుతున్న ఇద్దరు తమ్ముళ్లూ, చెల్లెలూ అందరూ తన ఆదాయంపై బ్రతుకుతున్నారు.

మరి రేపటినుంచి వాళ్ళనెలా పోషించాలో అర్థంకావటంలేదు వలజకి. ఏమయినా యింటికి పెద్దగా పుట్టడం చాలా తప్పు అనుకుంది. కొడుకయినా కూతురయినా తొలి సంతానంపై సంసార బాధ్యత పడుతుంది. అందునా

పెళ్ళికాకుండా కుటుంబ పోషణాభారం పైన పడటం ఘోరం అనుకుంది.

'హల్లో!'

అరడుగుల ఎత్తు అందాన్నిస్తుందా అనిపించింది అతన్ని చూడగానే. ఎత్తుకుతగ్గ శరీరం, మంచి కళ్ళు – అవి కాంతిని చిమ్ముతున్నాయ్. చక్కని ముక్కు, చిన్న నుదురు, వంకీల జుట్టు, కొత్తగా సెలక్టయిన సినిమా హీరోలా వున్నాడతను.

'హల్లో! నా పేరు నజీముద్దీన్!' అన్నాడతను మళ్ళీ

నాగరకత నేర్పిన అలవాటుతో 'నా పేరు వలజ!' అంది సమాధానంగా. 'ముస్లిమ్ కుర్రాడి వయ్యేనా ఇంత అందంగా వున్నావ్?' అనుకుంది.

ఒక్క క్షణం ఆగి 'ఆ సిమ్మెంట్ బెంచీపై కూర్చుందామా?' అన్నాడతను.

మొదటినుంచీ జంకెరుగని జీవితం వలజది. ఆడది తన సంపాదనపై బ్రతకవలసి రావటం ఓ ధైర్యం! ఇదే తెగువ మనిషికి రక్ష.

కూర్చున్నా రిద్దరూ.

'చూడండి. మీరు అపార్థం చేసుకోనంటే ఓ మాట చెపుతాను.'

'ఒక్కటి కాదు, వంద చెప్పండి. ఫర్లేదు' నవ్వుతూ అంది ఆమె. అతని చొరవ ఆశ్చర్యం గొలపకపోయినా అట్రాక్షన్ కలిగించింది.

'నేను ఓ కంపెనీ రెప్రజెంటేటివ్‌ని. మేము మా ప్రొడక్షన్‌కి కొత్త కొత్త తరహాల్లో ప్రచారంచేస్తుంటాం. ఇప్పుడు కొత్తగా కాస్మెటిక్స్ తయారుచేశాం. దానికి ఎలా ప్రచారం అందజేయాలా అనుకుంటూ ఆలోచిస్తూ వుండగా మీరు కనిపించారు. తక్షణమే నా మనస్సులో ఓ వూహ మెదిలింది. మీరు ఆ వస్తువుని వాడుతున్నట్లుగా రీల్‌ఫిల్మ్ పిక్చరైజ్ చేసి దేశంమీద వదిలితే మా ప్రొడక్ట్‌కీ పేరు, మీకో మోడల్ గర్ల్‌గా పేరు వస్తుంది. మీకు వేలల్లో పారితోషికం లభిస్తుంది. జస్ట్ కొన్నిగంటల శ్రమ అంతే!' సూటిగా చెప్పాడతను.

కొన్ని క్షణాలు ఆలోచించింది వలజ. 'డ్రెస్సింగ్ విషయంలో నా సెన్స్‌కి భిన్నంగా లేకపోతే ఇష్టమే' అంది.

'యస్! మీ సెన్స్‌ని మన్నిస్తాం' అని లేచాడతను.

అతన్ననుసరించి కార్లో వెళ్ళి కూర్చుంది వలజ.

రివ్వున దూసుకుని వెళ్ళసాగింది కారు

ఓ బిల్డింగ్ ముందాగింది కారు.

'దిగండి' అన్నాడతను.

వలజ దిగింది.

ఇద్దరూ నడిచి వెళ్ళారు గేటు దాటి.

'పెద్ద కంపెనీయే లేకపోతే ఫిల్మ్ తీసి ఎడ్వర్టయిజ్ చేయగలుగుతారా?

అయినా ముందు ఏ బోర్డూ లేదేః' అనుకుంది వలజ.

తలుపుతీసి 'రండి' అన్నాడు మళ్ళీ.

లోపలికి వెళ్ళింది. పెద్దహాలు, ఓ వారగా పైకి మెట్లు, అతని వెంట అనుసరించింది.

పైకి వెళ్ళి ఓ పెద్ద రూములో ప్రవేశించారు.

అక్కడ ఆ సరికే మరో నలుగురు వ్యక్తులున్నారు

వీళ్ళని చూడగానే 'నమస్తే' అన్నారు ముగ్గురు. ఓ వ్యక్తి ఆర్టిస్టిక్ కళ్ళతో చూడసాగాడామెని.

'కూర్చోండి' అన్నాడు నజీముద్దీన్.

సోఫాలో కూర్చుంది వలజ. ఓ వ్యక్తి ఫ్లాస్కులోనుంచి కాఫీ వంచుకుని వచ్చి యిచ్చాడు. 'మీకు కాఫీ యిస్తోన్న అతను వేలుపిళ్లై ఆ బొమ్మల చొక్కా అతను సుందరరాజు. ఆ ఆ సిల్కు చొక్కా అతను నాయుడు. మీవైపు ఆరాధనగా చూస్తున్న అతను మూర్తి. మంచి ఆర్టిస్ట్. మిమ్మల్ని ఒక్కసారి చూసినా మీ బొమ్మ అద్భుతంగా గీయగల వేలు తిరిగిన చిత్రకారుడు. గొప్ప మేధావి మా కంపెనీకి వెన్నముక' పరిచయం చేశాడు.

నమస్కార ప్రతినమస్కారాలయ్యాయి.

"మీరు డ్రెస్ చూపితే...."

గొల్లున నవ్వాడు నజీముద్దీన్.

"మీకంతా అబద్ధం చెప్పాను. మాది ఆ బిజినెస్ కాదు. అసలు ఏ ప్రోడక్టూ వుత్పత్తి చెయ్యం. ఫిల్మ్ తీయడం అబద్ధం, అయితే మేం వ్యాపారస్తులమే. మంచి ఆర్టిస్టిక్ బుక్స్ ప్రింట్‌చేసి దేశ విదేశాల్లో 'టేస్టు'న్న వ్యక్తులకి అమ్ముకుంటాం. ఆర్టిస్టిక్ వాల్యూస్ తెలిసినవాళ్లు. యిరవైలూ ముప్పయిల్లాలూ యిచ్చి కొంటారు మా ఆల్బమ్స్‌ని."

లేచింది వలజ తీవ్రంగా

'సారీః నేను మీ టర్మ్స్‌కి అంగీకరించను'

'షటప్' అరవక కూర్చో. ఇక్కడికి వచ్చాక ఇంకెక్కడికీ వెళ్ళలేవు. మేం చెప్పినట్టల్లా వినాల్సిందే.' కరుకుగా అన్నాడు నాయుడు.

'యస్ అంతే. అన్నాడు వేలుపిళ్ళై'

నిస్సత్తువగా కూలబడిపోయింది ఆమె.

'మే మింతవరకూ రకరకాల స్త్రీలని రకరకాల దుస్తులు వేయించి ఆర్టిస్టిక్‌గా నుంచోబెట్టి ఫోటోలు తీసి అమ్మేవాళ్ళం. కానీ యీ పర్యాయం మా పిళ్లే ఓ మంచి సలహా యిచ్చాడు. అందమైన వంపుసొంపు లున్న అమ్మాయిల బొమ్మలు గీయించి ముద్రించి పంపితే లక్షలు కురుస్తాయన్నాడు. కెమెరాలో తీసిన బొమ్మలకంటే చిత్రకారుడు గీసిన బొమ్మల్ని ఆర్ట్ పేపర్‌పై ఆఫ్‌సెట్‌లో ముద్రిస్తే

మనో మోహనంగా వుంటుందన్నాడు. ఇది పెద్ద ప్రమాదం కాదు. ఇందులో నీ ముఖం కనిపించదు. చిత్రకారుడు మీ అవయవాలని గీస్తాడు. ముఖం ఏదో గీసేస్తాడు అంతే!'

'ఛీ! మీ కప్ప చెల్లెళ్ళు లేరా? మరీ డబ్బుకోసం యింత దిగజారాలా? అదే అయితే మీ పెళాల్ని, తల్లుల్ని చెల్లెళ్ళని గీయించి అమ్ముకోండి.' తీవ్రంగా అని లేచి నుంచుంది వలజ.

అందరి పళ్ళూ పటపట లాడాయి. కనుబొమలు మూతపడ్డాయి. అయినా వ్యాపారం నేర్పిన నాగరికత మౌనాన్ని పాటింపజేసింది.

'జస్టెమినిట్ మేడం. నేను నిన్ను చాలా రోజుల్నించి అబ్జర్వ్ చేస్తున్నాను. నాకు నీ కుటుంబం సంగతులు బాగా తెలుసు. రేపటినుంచి నీకు పట్టబోయే దుస్తితి నాకు నెలకు ముందే తెలుసు. అన్నీ ఆలోచించి పరిశీలించే నిన్ను ఎన్నిక చేశాను. మా వాడిని పంపాను. ఇదిగో పదివేలు, ఓ గంటో గంటన్నరో అంతే శ్రమ. ఇందులో పెద్ద కష్టం లేదు. నీ 'శీలం' పోవటంలేదు. కళ్ళు మూసుకుని బట్టలొలిచి మా మూర్తి చెప్పినట్లే నుంచుంటే యీ డబ్బు నీది' వివరంగా చెప్పి ఆగేడు రాజు.

'పశువా' అంది యింకేమీ అన్లేక.

'మవ్వేన్నయినా తిట్టు. నీకు మరో మార్గంలేదు. రాజీగా అంగీకరించి మాతో సహకరించితే యీ డబ్బు నీది. లేదా మేం నలుగురం రాక్షసులం. ఏమయినా చేస్తాం. కుక్కలు చింపిన విస్తరిలా అవుతుంది నీ బ్రతుకు. ఆ స్థితిలో మా మూర్తి నిన్ను ఎలాగూ చూస్తాడు. బొమ్మలు గీస్తాడు. మాకు రెండందాలా ఆనందం, ఆదాయం. నీకే కష్టమూ నష్టమూ. ఆలోచించుకో. సహకరించి భద్రంగా బయటపడి బ్రతుకు సుఖంగా సాగిస్తావో, పాడై బ్రతుకు పాడు చేసుకుంటావో నీ యిష్టం. ఎల్లాగయినా మా పని పూర్తి అవుతుంది, అన్నాడు నాయుడు.


ఒక్కొక్కరి ముఖాలే పరిశీలనగా చూసింది వలజ. తోడేళ్ళూ, నక్కలూ వున్న అడవిలో వున్నట్టుగా అనుభూతి చెందింది. కిం కర్తవ్యతా విమూఢురాలై పోయింది కొన్ని క్షణాలు. ఎటు చూసినా ముళ్లకంచె. విద్యుత్ప్రవాహ ప్రమాదం.

'ఏం చేయాలి?'

అనువుగానిచోట అధికులమనరాదు. పరిస్థితులకి తలవంచి తప్పించుకొని వెక్కిరించాలి. అంతే. ఎటూ తప్పనిసరి అయిన వేళలో సేఫ్టీ మార్గం మంచిది.

ఆలోచించి మూర్తివైపు చూసి 'వాళ్ళందర్నీ వెళ్ళమనండి, అంది.

"ఆల్ రైట్! మాకు డబ్బు ముఖ్యం కానీ నీవు ముఖ్యంకాదు. నీలాంటివాళ్ళు మాకు కో అంటే కోటిమంది దొరుకు తారు" అని కదిలారు. తలుపుదాకా



వెళ్ళిన నజీరుద్దీన్ జేబులోంచి వంద రూపాయల కట్ట తీసి మూర్తి వైపు విసిరేడు. చాకచక్యంగా అందుకుని దాన్ని వలజకి అందించేడు.

తలుపులు మూతబడ్డాయ్.

ఓ గంట తర్వాత స్కెచెస్ గీచుకున్న మూర్తి ఆమెని భద్రంగా బయటికి పంపేడు.

ఖిన్నమనస్సుతో వెళ్ళిపోయింది వలజ. మనసులో ఓ మూల డబ్బొచ్చిన ఆనందం సెలతేస్తున్నా.

* * *

నెలరోజులు గడిచిపోయాయ్.

ఆ రోజు సాయంకాలం ఆరు గంటలకి తను గీచిన చిత్రలేఖన కళాఖండాల్ని పట్టుకుని వచ్చాడు మూర్తి.

అవి చూసిన మిత్రులు నివ్వెరపోయారు. 'వలజ యింత అందంగా

వుందా? ఆమె వంపు సొంపులు యింత చూడ ముచ్చటగా వుంటాయా అని ప్రశ్నించారు.

చిరునవ్వు నవ్వాడు మూర్తి.

"వారే! నేను చూసిన అందాల్ని మీరే చూసి వుంటే అక్కడే గుండె ఆగి చచ్చేవాళ్ళు. లేదా పశువులకన్నా హీనంగా ప్రవర్తించి వుండేవాళ్లు.

చూడండి యీ బొమ్మని. ఈ బొమ్మ గీయటానికి ఆ కొమ్మ ఎంత చక్కగా వంగిందో గ్రహించుకోండి. ఒక కాలు కొద్దిగా ఎత్తి మరో కాలు అలవోకగా చాచి నడుం వంకరగా తిప్పి జఘన సౌందర్యం ప్రస్ఫుటంగా కనిపించేలా నించుంది. నేను కొంచెంగా ఆమె భుజాలు అలా మలిచాను. వక్ష సౌందర్యం కళ్ళకి కొడుతున్నది. ఆ వంపి లేకపోతే యీ సొంపురాదు.

ఈ బొమ్మ చూడండి. బోర్లా పడుకుని కాళ్ళు కొద్దిగా లేవనెత్తి రెండు చేతుల మధ్యా చెంపలు యిరికించుకుని తన బేడిస కళ్ళతో లోకాన్నే జయిస్తోంది ఆ ఫోజుని కొద్దిగా మార్చేను నేను. ఒక కాలు వంచేలా చేశాను. దాంతో రంభాస్తంభాల్లాంటి వూరువులు మెరుస్తున్నాయి.

అలా అలా వర్ణించి యిరవైనాలుగు బొమ్మలు చూపేడు. ఒకోక్క భంగిమ చూస్తుంటే వాళ్ళ కళ్లు తిరిగిపోయాయ్.

"మూర్తీ! నువ్వు నిజంగా చేయి తిరిగిన ఆర్టిస్ట్‌వి"

"ఉపయోగించుకునేవాడు లేక యిలా వుండిపోయాను పూజా పురస్కారాలు లేక బూజుపట్టి వున్నానుగానీ లేకపోతే నా మహిమలు చూపనా అన్నాడట వెనుకటికొక దేవుడు. అవకాశం రావాలే గానీ యిలాంటి బొమ్మలు లక్షలు గీసెయ్యగలను ఎవరికయినా!"

"ఎవరికయినా గీసిస్తావా" అడిగేడు పిళ్లై.

'ఏం డబ్బొస్తే చేదా' నవ్వుతూ అన్నాడు మూర్తి.

కొద్ది క్షణాలు ఆగి ముగ్గురూ పక్క రూంలోకి వెళ్ళిపోయారు. వాళ్ళలోవాళ్లు తర్జన భర్జనలు చేసుకున్నారు. 'వ్యాపారంలో కాంపిటీషన్ కూడదు. ఎమర్జన్సీ పెట్టి నాయకుల్ని బొక్కలో తోసింది నాయకురాలు తన కోసం మన కోసం ఏం చేసినా తప్పులేదు' అనుకున్నారు.

ముగ్గురూ తిరిగి వచ్చేసరికి మరో బొమ్మగీస్తున్నాడు మూర్తి. 'ఇదిగో ఇది చూడండి. టైటిల్ పేజీలా వుంది?' అన్నాడు.

నివ్వెరపోయారు వాళ్లు.

వెంటనే అన్నాడు వేలుపిళ్లై 'ఇదిగో మూర్తీ! నీ డబ్బు తీసుకో. ఇరవై వేలు. ప్రింటింగ్ అయ్యాక మరో

పదివేలు కాపీలమ్మి యిస్తాం. నీ బ్రతుకు సుఖంగా సాగుతుంది"

నజీముద్దీన్ డబ్బు యిచ్చాడు.

'ఆ పదివేలకీ పోస్ట్ డేటెడ్ చెక్కు యిప్పేయ్' అన్నాడు సుందరరాజు.

చెక్కు కూడా యిచ్చేరు.

మూర్తి ముఖం విప్పారింది

"కాపీ ఫ్రెండ్! వ్యాపారంలో నిర్లక్ష్యం పనికిరాదు. పోటీని ఎప్పుడూ తగలేస్తూ తగ్గిస్తూ వుంటేనే సక్సెస్ వస్తుంది లేదా సర్వనాశనమే. చూడు మాకు గీసిన బొమ్మలే నువ్వు యితర్లకి గీసి యిస్తే మా మొనాపలీ ఏముంది? మరో మరో ఆర్టిస్ట్ గీస్తేనో అనొచ్చు. అది వేరు. అందరూ నీలా సక్సెస్‌ఫుల్ ఆర్టిస్ట్సు కాదు. ఇదే మా భయం నిర్ణయం కూడా. మరి నువ్వు యితర్లకి గీయకుండా చేయటమెలా? ఏడాదేడాది మేమిచ్చే పదివేలతో నువ్వు తృప్తి పడతావా? నో! నో!

మాకు ఆశ పుట్టినట్టే నీకూ ఆశ పుట్టొచ్చు అప్పుడేం చేస్తాం మేం? నోట్లో వేలేసుకుని చూడొచ్చావాలి అంతే!

అందుకని—" ఆగేడు పిళ్లే.

మూర్తి ముఖంలో ఏదో భయం కనిపించింది.

"నేను—"

'నో ఆర్గ్యూమెంట్స్. మా నిర్ణయం సంగతి తెలుసుగా. ఓసారి నిర్ణయం తీసుకున్నాక, అది మారదు" అని 'యస్ ప్రొసీడ్, అన్నాడు.

అంతే!

నలుగురూ కలిసి అతన్ని బంధించి నోట్లో గుడ్డ కుక్కేరు.

'నా పేరు వేలుపిళ్లై తెలుసుగా. అందుకని బాగా వేలు తిరిగిన నీ స్కిల్‌కి ఆధారభూతమైన యీ వేళ్లు పుచ్చుకుంటాను' అని టక్కున చూపుడు వేలు బొటన వేలు, మధ్య వేలు రెండు గణుపుల దాకా కత్తిరించాడు

నోట్లో కుక్కిన గుడ్డ తీశాడు.

"స్పీక్!" అన్నాడు పిళ్లై

ప్రాణం పోతోన్నంత బాధ. అవమానం. దుఃఖం. అయినా అతను నోరు తెరవలేదు. పిళ్లై వేపు చూశాడు అంతే!

"వీడి చూపుకి కూడా ఆర్టిస్టిక్ గుణం వుంది వీడు చూడగలిగితే అసిస్టెంట్సు నయినా బొమ్మలు గీయిస్తాడు. కళ్లు పొడిచెయ్" నాయుడన్నాడు క్రూరంగా.

"దుర్మార్గుడా! అ మాట గుండెలో మ్రోగి కళ్ళద్వారా బయటికి వచ్చింది. అది చూసిన నజీముద్దీన్ అతని కను రెప్పలు బలంగా తెరిచి పట్టుకున్నాడు. జేబులోంచి తీసిన యాసిడ్ సీసా తెరిచి ఆ కంట్లో ఈ కంట్లో రెండు చుక్కల యాసిడ్ వేశాడు రాజు.

బాధతో కళ్లు బలంగా మూసుకున్నాడు మూర్తి.

* * *

రెండు నెలలు గడిచాయి.

హైద్రాబాద్ వచ్చాడు మూర్తి. ప్రముఖుడు అయిన తన ఫ్రెండ్, పబ్లిషర్ ధర్మారాయుడిని కలుసుకున్నాడు

ధర్మారాయుడు మూర్తిని చూసి చాలా బాధపడ్డాడు. అతని వేళ్లు పోయినందుకూ కళ్లు దెబ్బతిన్నందుకు చాలా విచారించాడు. ఎలా జరిగింది అని ప్రశ్నించాడు.

'ధర్మా! ఏం చెయ్యను చెప్పరా? పొట్ట గడవక యీ వృత్తిని నీచ పరిచాను. స్నేహం చేశారు. ద్రోహం చేశారు. ఓ అందమైన అమ్మాయిని పట్టుకొచ్చి వివస్త్రనుచేసి నాకు చూపి నాతో వివిధ భంగిమల్లో సెక్స్ బొమ్మలు గీయించారు. చక్కగా, నెలనాళ్ళు కష్టపడి గీశాను. అది చూశారు. చాలా చాలా ఆనందించారు. ఆర్ట్ పేపర్ పై ఆఫ్‌సెట్‌లో ముద్రించి పారిస్‌కి, లండన్‌కి, అమెరికాకి పంపితే లక్షలు సంపాదించొచ్చని ఆశించారు. నేను పోటీగా మరెవరికయినా గీసిస్తే వాళ్ళ వ్యాపారం దెబ్బతింటుందని దుష్టంగా ఆలోచించి నన్నిలా చేశారు."

మూర్తి కంఠంలో దుఃఖం లేదు. ఏదో పట్టుదల వుంది.

షాకయ్యాడు ధర్మారాయుడు.

కొద్దిసేపు ఆగి 'చ్చొ! చ్చొ! ఎంత దుర్మార్గం. పోలీసు రిపోర్ట్ ఇవ్వలేక పోయావా?' అన్నాడు.

'అది సాధ్యం కాదు. గాయాలు బాగయ్యేదాకా వాళ్ళే చికిత్స చేశారు. కంటికి చల్లబడే మందులు వేశారు. తర్వాత మాయింటికి తెచ్చి ఏక్సిడెంటయిందని చెప్పి విడిచివెళ్ళారు."

కొద్దిసేపు మౌనంగా గడిచిపోయింది.

'ధర్మా! నా మనస్సులో ఓ వూహ వుంది.'


'చెప్పు.'

'అదృష్టమో దురదృష్టమో నా చూపు పూర్తిగా దెబ్బతినలేదు. గొద్దిగా కన్పిస్తుంది. కళ్ళకి లెన్స్ పెట్టుకుంటే బాగా చూడగల్గుతాను కొన్ని నిమిషాలు. కుడిచేయి దెబ్బతిన్నా, ఎడమచేయి దెబ్బ తినలేదు. ఎడమచేత్తో కూడా బొమ్మలు గీయగలను. నేనీ రెణ్ణెల్లూ సాధన చేశాను. సవ్యసాచిలా రెండుచేతులూ నాకు పనిచేస్తాయ్. ఇంతకుపూర్వం కూడా యీ చెయ్యి నొప్పెడితే యీ చేత్తో రంగులు పులిమేవాడిని. నాకున్న డిమాండ్‌ని మీటవటానికి అలాచేసేవాడిని. అది యిప్పుడు బాగా కనబడేలా కృషిచేశాను. యస్. చూడు' అని పేపర్, స్కెచ్ పెన్ తీసుకుని చకచకా గీశాడు మూర్తి. వేగం లేకపోయినా బొమ్మలో పర్‌ఫెక్ట్‌నెస్ వచ్చింది.

ఆశ్చర్యపోయాడు ధర్మారావు.

'ఇప్పుడు నీవు చేయవలసిన సహాయం చాలా వుంది.'

'చెప్పు' అరిపోతున్న గొంతుకతో అడిగేడతను.




'నీ విలా యీ పుస్తకాలు వేసుకుని ఏం బాగుపడతావ్ ? నా మాట విని యీ బొమ్మల పుస్తకం పబ్లిష్ చేయ్. పంప వలసిన ఫారిన్ అడ్రసులు కూడా నాకు తెలుసు. వాళ్ళని దెబ్బతీద్దాం.

ధర్మారాయుడు మాటాడలేదు.

'ధర్మా ! మనం బాల్యమిత్రులం. ఒక వూరివాళ్ళం. ఒక కులంవాళ్ళం. నా పగ యిది – నేను వాళ్ళని సాంఘికంగా ఏమీ చెయ్యలేను. నా మనస్సులో పగ ఆరని జ్వాలలా రగులుతూ వుంది. ఈ పగకి శాంతి కావాలి. ఇది శాంతిస్తేతప్ప నేను జీవించలేను. నువ్వు ఊ అను. నిన్ను కోట్లకి అధికారిని చేస్తాను. నా పగ తీర్చుకుంటాను. లేదంటావా హుస్సేన్ సాగర్‌లో దూకి చస్తాను. పగతీర్చుకో లేని బ్రతుకు బ్రతికి నిష్ప్రయోజనం' ఆవేశంగా అన్నాడు మూర్తి.

'మూర్తీ ! నువ్వొక చిత్రకారుడివి. ఆర్టిస్ట్‌కి యింత పగ కూడదు' అన్నాడు ధర్మారాయుడు.

'ధర్మా ! కవి అయినా, రచయిత అయినా, చిత్రకారుడయినా ఒకటే ! ఎవరూ అవమానాన్ని సహించలేరు. కవి నాలుక కోస్తే అతడు వూరుకుంటాడా ? మౌనంగా అవమానాన్ని భరిస్తాడా ? శపిస్తూ తిట్టుకవిత్వం చెపుతాడు. నేనూ

అంతే। మనిషి బాధపడితేనే అత్యుత్తమమైన వస్తువు సృష్టించబడుతుంది.

ఇదిగో, యిటు చూడు. నే గీచిన బొమ్మలు. ఇవిగో వాళ్ళకి నే గీసిస్తే ముద్రించిన బొమ్మలు. చూడు నా పగకి ఫలితం. యీ బొమ్మలముందు ఆ బొమ్మలు బలాదూర్. అవి ఒక స్త్రీ నగ్నంగా చూపిన సౌందర్యానికి ప్రతిబింబాలు. ఇవి నేను చిత్రకారుడిగా ఆరాధనా దృష్టితో నా కుంచెకు వూపిరిగ చూసి ఎన్నో ఏళ్లుగా మలుచుకున్న కళాఖండాలకి మూలమైన బొమ్మలకి మరో మారురూపాలు. యదార్థంకంటె కల్పన అందంగా వుందనటానికిది నిదర్శనం.'

బేగ్‌లోంచి తీసియిచ్చాడు మూర్తి.

అవి చూసిన ధర్మారాయుడు ముందుగా అసహ్యించుకున్నాడు. తర్వాత ఆశ్చర్యపోయాడు. అభినందించాడు.

'మూర్తీ। ఈ పూట బాగా విశ్రాంతి తీసుకో. రాత్రికి మాటాడదాం.' అని తన షాపుకి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి తన ఏర్‌కండీషన్డ్ సౌండ్-ప్రూఫ్ గదిలో మూర్తితో యిలా అన్నాడు ధర్మారాయుడు.

"మూర్తీ। నేను నీ ప్రపోజల్ అంగీకరించాను. నీ బొమ్మలు అప్పుడే ప్రెస్‌లో యిచ్చాను. ఈ వ్యాపారంలో మరోవ్యక్తి తోడులేనిదే సాగదు. మూగవాడైన వర్కర్ని తోడుచేసుకున్నాను.

ఇక పోతే నీ విషయం.

నన్ను క్షమించు.

నేనూ వ్యాపారినే। నీవు శాశ్వతంగా యిక యీ గదిలో బందీవి. నీకు అన్ని సుఖాలూ అన్ని సౌకర్యాలూ అమరుస్తాను. నీ యింటికి యిప్పుడు పదివేల దాకా పంపుతాను. నెలనెలా వేయి పంపుతాను.

మరి నీలోని ఆర్టిస్ట్ వూరుకోడు. నా పైకూడా పగతీర్చుకోటానికే యత్నిస్తాడు. అందుకే నీ ఎడమచేతి వ్రేళ్ళు కత్తిరిస్తాను.

అంతే।

క్షణాలపై అతని వ్రేళ్ళు కత్తిరించేశాడు ధర్మారాయుడు.

మూర్తి ముఖాన నిర్లిప్తతతో కూడుకున్న చిరునవ్వు వెలిగింది. "ధర్మా। ధర్మాన్ని చెప్పావ్. నాకు తగిన సన్మానం చేశావ్. అవును. నేను ఆర్టిస్టుని. నాలోని గుణానికి తగిన సత్కారం జరిగింది.

అయినా లోకంలో కృతజ్ఞత ఎక్కడుంది బ్రదర్? ఆల్‌రైట్. నీవైనా సుఖించు."

నిస్తేజుడై స్థాణువైపోయాడు ధర్మరాయుడు.